సాక్షి సిద్దిపేట

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



మక్కల కొనుగోలుకు సన్నాహాలు

మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఊరట. మక్కల కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 6లో..



పోచమ్మకు బంగారు ముక్కు పుడుక

బోరంచ నల్లపోచమ్మ అమ్మవారికి మంత్రి హరీశ్‌రావు బంగారు ముక్కుపుడుక బహూకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. 6లో..



రెగ్యులర్ చేసే వరకు పోరాటం

చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు దీక్ష చేపట్టారు. 7లో..

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



వర్గల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్‌రావు

ప్రశాంత్‌నగర్/వర్గల్: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాపంగా శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వర్గల్ నవోదయలో అడ్మిషన్ కోసం ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 5,691 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 5,054 మంది పరీక్షకు హాజరయ్యారని వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ జి.రమేశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 2,329 మంది విద్యార్థులకుగాను 2,046 మంది పరీక్షకు హాజరైనట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరీక్షల సహాయ సంచాలకులు లక్ష్మయ్య తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంఘాలకు గజ్వేల్‌లో స్థలాలు

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ సంఘాలకు స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేస్త్రీ సెంట్రింగ్ యూనియన్, మార్వాడీ సంఘం, మంగలి సంఘం, డీసీఎం డ్రైవర్స్, ఫొటోగ్రాఫర్స్, ఆటో వర్కర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ యూనియన్లు, వెల్డింగ్ అసోసియేషన్, గంగపుత్ర సంఘాలకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే పట్టాలు అందజేస్తామన్నారు. స్థలాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


రోగులకు అందుబాటులో ఉండాలి




వైద్యాధికారిణి రజితను విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సౌమ్య

మద్దూరు(హుస్నాబాద్): వైద్యులు రోగులకు అందుబాటు ఉంటూ మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సౌమ్య అన్నారు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ సౌమ్య తనిఖీ చేశారు. వారం రోజులుగా వస్తున్న ఫిర్యాదులపై వైద్యాధికారిణి రజితను విచారించారు. అనంతరం వైద్యసేవలపై ఆరాతీశారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



మల్పని తుషార్



గొట్టిపాటి అభిరామ్

సిద్దిపేటఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్‌లో సిద్దిపేట విద్యార్థులు ప్రతిభకనబర్చారు. శనివారం విడుదలైన ఫలితాల్లో పట్టణానికి చెందిన ఎం.తుషార్ 99.99 శాతం మార్కులతో ఓపెన్ కేటగిరీలో 63వ ర్యాంకు సాధించగా, గొట్టిపాటి అభిరామ్ 99.96 శాతం మార్కులతో 480వ ర్యాంకు, కలకుంట్ల రిషిక 99.67% మార్కులతో 3,832వ ర్యాంకు సాధించగా, 99.61 శాతం మార్కులతో నల్ల వైష్ణవి 4,530వ ర్యాంకు, 98.63% మార్కులతో నల్ల బసంత్ 15,926వ ర్యాంకు సాధించారు. మరో ఇద్దరు విద్యార్థులు బోడవెంకట సాయిచంద్ 98.54, గుండ్ల సుహాస్ 94.22% మార్కులు వచ్చాయి. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు అభినందించారు.

వర్గల్, జిల్లెలగడ్డ గురుకులంలో...

వర్గల్/ హుస్నాబాద్ రూరల్: వర్గల్ జ్యోతిబా పూలే బాలికల జూనియర్ గురుకుల కళాశాల విద్యార్థినులు డి. అనూష, పి. సాయిభార్గవి, ఎస్. గాయత్రి, వి.దివ్య, ప్రతిభచాటారని కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గిరిజన గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు మూడవత్ శ్రీకాంత్, ఎం.శ్రీకాంత్ ప్రతిభచాటారు.

అరిగోస

- వడగండ్ల వర్షంతో రైతులు కుదేల్
- జిల్లాలో 92,680 ఎకరాల్లో పంట నష్టం
- మరో రెండు రోజులపాటు వర్ష సూచన
- కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తుతున్న ధాన్యం



కూరెళ్ల కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం చూస్తున్న రైతు వెంకటేశ్వర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అకాల వర్షానికి అన్నదాత కుదేలయ్యాడు. పక్షం రోజులుగా అక్కడక్కడా కురుస్తున్న వడగండ్ల వర్షంతో రైతులు అరిగోసపడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 3,46,797 ఎకరాల్లో వరి, 16,683 ఎకరాల్లో మొక్కజొన్న, 7,228 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు సాగుచేశారు. 14 వేల ఎకరాల్లో మామిడి, నాలుగు వేల ఎకరాల్లో కూరగయాలు సాగవుతున్నాయి. మరో వారం, పది రోజుల్లో వరి, మొక్కజొన్న, మామిడి చేతికొచ్చే అవకాశం ఉంది. కానీ.. అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పటి వరకు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 84,230 వేలఎకరాల్లో వరి , 3,140 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 5,160 ఎకరాల్లో మామిడి, 150 ఎకరాల్లో కూరగయాల

> యాసంగి సాగు విస్తీర్ణం: 3,76,712 ఎకరాలు
> నష్టపోయిన పంటల విస్తీర్ణం: 92,680 ఎకరాలు
> ప్రారంభించాల్సిన కొనుగోలు కేంద్రాలు: 416
> ఇప్పటి వరకు ప్రారంభించిన కేంద్రాలు: 117

పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంకా నష్టం వివరాలు సేకరిస్తున్నారు.మద్దూరు, చేర్యాల, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల్లోనే నష్టం ఎక్కువ జరిగిందని అధికారులు తెలిపారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు..

యాసంగిలో 7,97,219 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని సివిల్ సప్‌లై అధికారులు అంచనా వేశారు. కొంతవరకు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించినా.. 6 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఐదు మెప్మా, 192 పీఏసీఎస్, 219 ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనుంది. కానీ.. ఇప్పటి వరకు కేవలం 117 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. వర్షాలకు తడిసి మొలకలు వస్తున్నాయి. కొనుగోలు వేగవంతం చేస్తే నష్టం తక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

మొలకెత్తిన ధాన్యం కొనాలి



ఐదెకరాల్లో వరిసాగుచేసిన. 10 రోజుల ధాన్యం మార్కెట్‌కు తెచ్చిన. చెడగొట్టు వానకు వడ్లన్నీ తడిసి మొలకెత్తినయ్. అధికారులు ఎలాంటి షరతులు లేకుండా మొలకొలొచ్చిన వడ్లను కొనాలి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– ఎంగారి రాజిరెడ్డి, దుబ్బాక

నష్టం వివరాలు సేకరిస్తున్నాం



కొద్దిరోజులుగా కురుస్తున్న వడగండ్ల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. నష్టం వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు 87 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నాయి. పూర్తిస్థాయి నష్టం వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం రాశులపై చీరలు కప్పిన రైతులు

ఆరబెట్టడానికి పాట్లు

దుబ్బాక: తడిసిన ధాన్యం ఆరబెట్టడం కోసం రైతులు నానాపాట్లు పడుతున్నారు. దుబ్బాక పట్టణంలో మార్కెట్ యార్డును గత సోమవారం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అయినా ఇప్పటి వరకు కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. దీంతో యార్డుకు తెచ్చిన వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. వాటిని ఆరబెట్టడానికి నానా తంటాలు పడుతున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందోనని ఆందోళన చెందుతున్న రైతులు అక్కడే జాగారం చేస్తున్నారు.

టార్పాలిన్ల జాప్యం

ధాన్యం తడుస్తున్నా.. టార్పాలిన్లు ఇవ్వడంలేదని పలువురు రైతులు మండిపడుతున్నారు.దుబ్బాకలో టార్పాలిన్ ఇవ్వకపోవడంతో రైతులు ధాన్యం తడవకుండా చీరలు కప్పి కాపాడుకుంటున్నారు.

సాక్షి విద్యార్థులకు వేసవి శిబిరం

'సాక్షి' మీడియా గ్రూప్ మే 1 నుంచి 10 వరకు వేసవి ఉచిత చిత్రలేఖన శిక్షణ శిబిరం నిర్వహించనుంది. రెండో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు పాల్గొనవచ్చు. ప్రముఖ చిత్రకారులు రుస్తుం, నహీం రుస్తుం శిక్షణ ఇస్తారు.

వేదిక	కాకతీయ టెక్నో హైస్కూల్, హౌసింగ్ బోర్డు కమాన్ ఎదురుగా, సిద్దిపేట
సమయం	ఉదయం 9 గంటల నుంచి 10 గంటల శిక్షణ

వివరాలు, పేర్ల నమోదుకు 9866898692,8686960064 నంబర్లలో సంప్రదించాలి.

మన ప్రాజెక్టులు దేశానికే ఆదర్శం

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): తెలంగాణ ప్రాజెక్టులు దేశానికి ఆదర్శమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక, కుకునూరుపల్లి శివారుల్లో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి నిజాంసాగర్, హల్దీ వాగులోకి నీటి తరలింపును ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, హన్మంత్ షిండేతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. రాష్ట్రంలో సాగునీటి వినియోగానికి మల్లన్నసాగర్ గుండెకాయగా నిలిచేలా సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారన్నారు. ప్రపంచ దేశాలు అబ్బురపడేలా నిర్మించారని కొనియాడారు. సాగర్ వెనుకభాగం కాల్వ ద్వారా ఆరువేల క్యూ సెక్కుల నీరు హల్దీవాగులో కలుస్తుందన్నారు. మల్లన్న సాగర్ నుంచి హల్దీవాగు ద్వారా జుక్కల్, బాన్సువాడ, నిజామాబాద్ నియోజకవర్గాల్లో రెండు పంటలకు సాగునీరందనుందన్నారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా జుక్కల్ నియోజక వర్గ గ్రామాల్లో 10 వేల ఎకరాలు, నిజామాబాద్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలు, బోధన్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి హల్దీ వాగుకు వెళ్లే రెండు కాల్వలకు సీఎం పేర్లు పెట్టాలన్నారు. మూడేళ్లలో మల్లన్న సాగర్‌ను పూర్తిచేసిన ఈఎన్‌సీ అధికారులు, ఇంజినీర్లు, కార్మికులకు శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు స్పీకర్‌ను కలెక్టరు ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచులు పుల్లోజు కిరణ్‌కుమార్ , బచ్చలి మహిపాల్, పొల్కంపల్లి జయంతి, మిట్టపల్లి వసంత, కందూరి కనుకవ్వ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పాల శంకర్, లగిశెట్టి కనుకయ్య, ఎంపీటీసీ భూములుగౌడ్, లీడర్లు కాచం నవీన్, కోల రవీందర్, తూం మహేందర్, కొంతం రాజు, నర్సింలు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న సాగర్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రైతే దేశానికి వెన్నెముక



ఉత్తమ రైతు అయిలయ్యను సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

హుస్నాబాద్: రైతే దేశానికి వెన్నెముక అని, దేశంలో 75 శాతంమంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం అన్నారు. శనివారం హుస్నాబాద్‌లో రైతు వేదికలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు రైతు సేవా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లాలో మిట్టపల్లిలో మొదటిసారిగా వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, రెండో కేంద్రం హుస్నాబాద్‌లో ప్రారంభమైందన్నారు. రైతు దుక్కులు దున్నడం మొదలు...పంట చేతికివచ్చే వరకూ ఎన్నో బాధలు అనుభవిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పెట్టి దిగుబడి రాకపోవడం, పెస్టిసైడ్, నాసికరం విత్తనాలు వేసి నష్టపోవడం, ఇన్సూరెన్స్ సకాలంలో అందకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతుల బాధలు గమనించి రాష్ట్రమంతా రైతు న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచించిందన్నారు. రైతులకు వ్యవసాయంపై న్యాయ సలహాల కోసం పారా లీగల్ వలంటీర్ రాజ్‌కుమార్‌ను నియమించినట్లు ఈ సందర్భంగా జడ్జి తెలిపారు. ప్రతీ రైతు న్యాయ సలహాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ రైతు ఐలయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ జడ్జి స్వాతిరెడ్డి, హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, ఏసీపీ సతీశ్, వ్యవసాయ శాఖ ఏడీ మహేశ్, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ భాషవేని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్ష్యాధారాల ఆధారంగానే తీర్పులు

సాక్ష్యాధారాల ఆధారంగానే కోర్టులో తీర్పులుంటాయని హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టులో న్యాయమూర్తులకు ఉన్న ఒత్తిడి ఏ ప్రొఫెషన్‌లో ఉండదన్నారు. ఎన్ని కేసులు వచ్చినా ఇరువైపుల వారు చెప్పినవి వినేవరకు కూర్చోవాల్సిందేనన్నారు. రెండు వైపుల మాటలు వినకుండా తీర్పు చెబితే న్యాయం జరగదన్నారు. ప్రతీ ఒక్కరు పెద్దలను గౌరవించాలన్నారు. పాఠశాల జీవితం మళ్లీ రాదని, అప్పటి జ్ఞాపకాలు గొప్ప అనుభూతి కలిగిస్తాయన్నారు. అనంతరం వజ్రోత్సవ కమిటీ బాధ్యులు జడ్జిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్, సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, వజ్రోత్సవ కమిటీ కన్వీనర్ కొండ లక్ష్మణ్, న్యాయ విజ్ఞాన సదస్సు కన్వీనర్ ఒంటెల రత్నాకర్, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, న్యాయవాదులు రాజిరెడ్డి, లక్ష్మణ్‌రావు, గులాబీల మల్లారెడ్డి, సాయిని మల్లేశం, బాకం సంపత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో విద్యావిప్లవం రావాలి

దుబ్బాక: అణగారిన వర్గాల పిల్లలకు అక్షరమే ఆయుధాం కావాలని, అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజస్థాపనతోనే విద్యావిప్లవం సాధ్యమవుతుందని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అన్నారు. దౌల్తాబాద్ మండలం ఇందూప్రియాల్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. దేశంలో రాజ్యాంగం మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనిని కలిసికట్టుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టడం హర్షనీయమన్నారు. అనంతరం అద్దంకి దయాకర్ మాట్లాడుతూ..పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ సంధ్య, సర్పంచ్ శ్యామల కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్ గౌడ్, నాయకులు ర్యాకం శ్రీరాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందూప్రియాల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సాయిచంద్

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం

ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

బెజ్జంకి(సిద్దిపేట): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధనకోసం ప్రతీ ఒక్కరు కృషిచేయాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని దాచారంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లతో కలిసి అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరించారు. అంబేడ్కర్ సంఘ భవనం ప్రారంభించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కారణంగానే తెలంగాణ సాధించుకోగలిగామన్నారు. సీఎం కేసీఆర్ దేశంలోని ఏరాష్ట్రంలో లేనివిధంగా సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారని తెలిపారు. దాచారంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారమిప్పించడమే కాకుండా పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. దళితుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు పేర్కొన్నారు. చిలాపూర్ పల్లెలో నూతన గ్రామ పంచాయతీ, మహిళా సంఘ భవనాలను ప్రారంభించారు. దళితబంధులో మంజూరైన పౌల్ట్రీఫాం, డెయిరీ ఫాం యూనిట్లను పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషిచేసిన జెడ్పీటీసీ కనగండ్ల కవిత తిరుపతిలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, ఇల్లంతకుంట జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్ ఎరవెల్లి మమత, ఎంపీడీవో రాము, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్, అంబేడ్కర్ సంఘం నాయకులు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్త, బాలనర్సు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దాచారంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సమన్వయంతో సాగుదాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో సాగుతూ లక్ష్యాన్ని అధిగమిద్దామని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు సూచించారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి హరీశ్ రావు ఆలోచన విధానాలకు అనుగుణంగా సిద్దిపేట పట్టణాన్ని రాష్టానికి ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ, ఆరోగ్య, ఆకుపచ్చ సిద్దిపేట కోసం ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. వచ్చే నెల19 నుంచి 21 వరకు సిద్దిపేటలో నిర్వహించనున్న యోగోత్సవాన్ని సక్సెస్ చేయాలన్నారు. అనంతరం ఎజెండాలోని 25 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్, కౌన్సిలర్లు రేణుక, కవిత, శ్రీదేవి, దీప్తి, బాలలక్ష్మి, పూర్ణిమ, శోభారాణి, శ్రీలత, తస్లిబేగం, వినోద్, యోగి, అర్వింద్‌రెడ్డి, లక్ష్మణ్, రవి, మల్లికార్జున్, రియాజ్, నాగరాజు, సాయికుమార్, ప్రవీణ్, సత్తయ్య, షాహీద్ పాల్గొన్నారు.

కులవృత్తులకు పెద్దపీట

- ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక: తెలంగాణలో కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాకలో జరుగుతున్న పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణ ఉత్సవాలకు శనివారం హాజరయ్యారు. అంతకుముందు వారిని ముదిరాజ్‌లు ఆలయం వరకు భారీర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో పెద్దమ్మతల్లి దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించారని కొనియాడారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంత్రి హరీశ్ రావు సహకారంతో రూ.25 లక్షలు రిలీజ్ చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ బీసీల కోసం హైదరాబాద్‌లో విలువైన స్థలంలో ఆత్మగౌరవ భవనం నిర్మించడం సంతోషకరమన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో సీఎం కేసీఆర్ ముదిరాజ్ సంఘ భవనాలు నిర్మించడం సంతోషకరమన్నారు. గత నాలుగు నెలల నుంచి నియోజక వర్గంలో దాదాపు 40 ముదిరాజ్ భవనాల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు పిట్టల రవీందర్, రమాదేవి, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనీత భూంరెడ్డి, కౌన్సిలర్ పులిగారి కల్పన ఎల్లం, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాడబోయిన రాజు, పీఏసీఎస్‌సీ చైర్మన్ కై లాశ్ తదితరులు పాల్గొన్నారు.



శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

క్లుప్తంగా

భార్యతో గొడవపడి..


కృష్ణ(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఓ భర్త అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని కట్టపోచారం గణపతిగూడేనికి చెందిన కృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 28వ తేదీన భార్య సునీతతో గొడవ పడి ఉదయం పదిగంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేసి చూడగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి దుర్గయ్య ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి


శిల్పన (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): గుండెపోటుతో ఓ మహిళ మృతి చెందింది. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీరుదు చెన్నయ్య–శిల్పన(22) దంపతులు. వీరిద్దరూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఒక్కసారిగా శిల్పన అస్వస్థతకు లోనైంది. చికిత్స నిమిత్తం మెదక్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శిల్పనకు రెండేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు ప్రియాంక కాగా, చిన్న కూతురు వయసు నెలన్నరలోపే.శిల్పన అకాల మృతిని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం ద్వారా పిల్లలను ఆదుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామని గ్రామ సర్పంచ్ సువర్ణ, ఇతర నాయకులు తెలిపారు.

మక్కల కొనుగోలుకు సన్నాహాలు

ఉమ్మడి జిల్లాలో సాగు (ఎకరాల్లో)	37,000
దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నులు)	83,000
ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు	50

సాక్షి, సిద్దిపేట: మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఊరటే. మక్కల కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 37,920 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, 83వేల మెట్రిక్ టన్నుల మక్కలు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కొనుగోళ్లు కూడా ప్రారంభించనున్నారు.

నాణ్యత పేరుతో ప్రైవేట్ వ్యాపారుల ఇబ్బందులు

మక్కల నాణ్యత సరిగ్గా లేదంటూ ప్రైవేట్ వ్యాపారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. వానల కారణంగా దెబ్బతిన్న పంటలతో నష్టపోయిన రైతులకు వ్యాపారులు ధర తక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే మక్క రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,962 చొప్పున చెల్లించి కొనుగోలు చేయనున్నారు.


సిద్దిపేట మార్కెట్ యార్డులో ఆరబోసిన మక్కలను చూస్తున్న మహిళా రైతు (ఫైల్)

- సిద్దిపేట జిల్లాలో 17వేల ఎకరాలు, సంగారెడ్డిలో 12,500, మెదక్‌లో 8,420 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఒక్కో ఎకరానికి సుమారుగా 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 83వేల మెట్రిక్ టన్నుల మక్కల దిగుబడి వస్తుంది.
- సిద్దిపేటలో 25, మెదక్‌లో 16, సంగారెడ్డిలో 9 కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

రెండు రోజుల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ 1,962ను క్వింటాల్‌కు చెల్లిస్తాం. రైతుల బ్యాంక్ అకౌంట్‌లోకి మక్కల డబ్బులు నేరుగా జమ చేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్ డీఎం, సంగారెడ్డి

సిద్దిపేటలో...

మల్లంపల్లి, అక్కన్నపేట, పోతారం(జే),కట్కూర్(అక్కన్నపేట), బెజ్జంకి మండలంలో వెల్దుర్, బెజ్జంకి, చేర్యాల, చిన్నకోడూరు. దుబ్బాక, గజ్వేల్, మీర్జాపూర్, గాందీనగర్, మహ్మదాపూర్, హుస్నాబాద్, కోహెడ, మిరుదొడ్డి, చెప్యాల్, నంగనూరు, దౌల్తాబాద్, గట్లమల్యాల, పాలమాకుల, ఇర్కోడ్, బుస్సాపూర్, సిద్దిపేట, తొగుట.

మెదక్‌లో...

తూప్రాన్, కల్వకుంట, నిజాంపేట్, రామాయంపేట, బచ్చురాజుపల్లి, పాట్రియల్, రాయాలపూర్, ముస్లాపూర్, నర్సాపూర్, శంకరంపల్లి, చేగుంట, శివ్వంపేట, వాడి(మెదక్), హవేళిఘన్‌పూర్, చిన్నఘన్‌పూర్, వెల్దుర్తి.

సంగారెడ్డిలో...

బొక్కాస్‌గావ్, క్రిష్ణపూర్, ఇప్పపల్లి, సదాశివపేట్, ఝరాసంగం, పీచరగడీ, నిజాంపేట, ఎడాకుపల్లి, వరంలలో కేంద్రాలు ఏర్పాటు చేయన్నారు.


బోరంచనల్లపోచమ్మకు బంగారు ముక్కుపుడుకను అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

బోరంచ నల్లపోచమ్మకు బంగారు ముక్కు పుడుక

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ అమ్మవారికి మంత్రి హరీశ్‌రావు బంగారు ముక్కు పుడుక బహూకరించారు. శనివారం మంత్రికి ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, పూజారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి బంగారు ముక్కుపుడుకను అలంకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు త్వరగా పూర్తి అయ్యి నారాయణఖేడ్ ప్రాంతం సస్యశ్యామలం కావాలని ఆకాంక్షించారు. ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి,నేతలు రవీందర్‌నాయక్, విఠల్‌రావు, మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాములు, సర్పంచ్ రేణుక పండరి పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు బంద్

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వరద నీరు


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు అండర్ బ్రిడ్జి కింద వరదలో నిలిచిపోయింది. మధ్యాహ్నం బస్సును అక్కడ నుంచి తొలగించారు. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా నీరు నిలిచింది. జీహెచ్‌ఎంసీ ఏఈ సునీల్ సిబ్బంది వరద నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు.

ఆలిండ్ ఎంప్లాయిస్ ప్రధాన రోడ్డులో వరద...

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన రోడ్డులో వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 9 గంటలకు వరద నీరు వెళ్ళడంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.

సమాజ సేవలోనే తృప్తి


మాచవరం సర్పంచ్ మాధవి

మెదక్‌జోన్: మెదక్ మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన కోటపాటి మాధవి 2019లో సర్పంచ్‌గా భారీ మెజార్టీతో గెలుపొందారు. తను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవ కోసం ఖర్చు చేయాలనేది ఆమె తపన. మాధవి భర్త శ్రీనివాస్ చౌదరి సిద్దార్థ పాఠశాలల యజమాని. కాగా మాచవరంలో పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో సర్పంచ్ సొంత డబ్బు ఖర్చు చేసి పంచాయతీ భవనం నిర్మించింది. అందులో ఫర్నిచర్‌కు రూ. 50 వేలు, ప్రహరీ నిర్మాణానికి మరో రూ. 3 లక్షలు ఖర్చు పెట్టి నిర్మాణాలు పూర్తి చేయించింది. అంతే కాకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు రూ. 1.50 లక్షలు ఖర్చు పెట్టి డ్యూయల్ డెస్కులు అందజేసింది. మరో రూ. 5 లక్షలు ఖర్చు చేసి గ్రామం చుట్టూ నాలుగు బస్టాండ్లను నిర్మించింది. సంపాదనలో కొంత సమాజ సేవ కోసం ఉపయోగిస్తే అది ఎంతో తృప్తిని ఇస్తుందని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో మాచవరం సర్పంచ్ మాధవి


సర్పంచ్ మాధవి సొంత నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

జీవితంపై విరక్తి చెంది...

జహీరాబాద్: జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. మండలపరిధిలోని రంజోల్ గ్రామానికి చెందిన చాకలి నర్సమ్మ(60) భర్త మూడు సంవత్సరాల క్రితం మరణించాడు. ఆమెకు సంతానం లేదు. మంచీచెడు చూసేవారు ఎవరూ లేరు. గ్రామస్తులతో తరచు చనిపోవాలని ఉందని చెబుతుండేది. ఈనెల 23వ తేదీన ఆమె అదృశ్యమైంది. శనివారం శనివారం ఆర్‌ఎల్‌ఆర్ పాఠశాల సమీపంలో ఉన్న బావిలో శవమై తేలగా కనుగొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో...


కొమురయ్య

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ రాజుగౌడ్ కథనం ప్రకారం ..మండలపరిధిలోని కొండంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బండి బాలకొమురయ్య (45) వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సంవత్సరం కిందట కూతురి వివాహం చేశాడు. ఈ క్రమంలోనే అప్పులు పెరిగాయి. బాకీలుతీర్చే మార్గం లేక మనస్తాపం చెందిన కొమురయ్య శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం అతని కోసం వెతకగా, పొలానికి వెళ్లే దారిలో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ల అందజేత

దుబ్బాక: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 24 గంటల్లోనే గుర్తించి పోలీసులు బాధితుడికి అందజేశారు. ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపూర్‌కు చెందిన నవీన్ సెల్‌ఫోన్ పోయిందంటూ దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి అందులో తన సిమ్ వేయగా, పోలీసులకు ఆ వివరాలు తెలిశాయి.

బేగంపేటలో..

రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన గడ్డం రాజు ఫోన్ పోగొట్టుకోగా, గుర్తించారు. ఎస్‌ఐ అరుణ్ బాధితుడి అందజేశారు.


సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ మహేందర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని టీటీసీ భవన సమీపంలోని ఒడిసెల కుంటలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయిన విషయం స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. అక్కడకు చేరుకున్న వారు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని ఆచూకీ కోసం వెతకగా, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని వయస్సు 35 సంవత్సరాల పైన ఉంటుందని, చామన ఛాయ రంగు కలిగి గులాబీ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ సీఐ నెంబర్ 9812667317, ఎస్‌ఐ నెంబర్ 9712582022కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ మహిళా క్రీడాకారిణులను వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మెదక్ జిల్లా బాల్ బాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య డిమాండ్ చేశారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ మహిళా క్రీడాకారిణులను వేధించిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానుల నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతు ఇస్తున్నామన్నారు.

బేస్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల కేంద్రంలో బేస్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని పీఈటీ గోవర్ధన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రాజార్షి షా, యువజన క్రీడల అధికారి నాగరాజుల ఆదేశాల మేరకు ఐటీసీ పరిశ్రమ వద్దగల క్రీడా ప్రాంగణంలో క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మే 1వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరం పనిచేస్తుందన్నారు. కాగా చేగుంట మండలం చందాయిపేట ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న తనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

కంచన్‌పల్లిలో కార్డన్ సెర్చ్

15బైక్‌లు, ఆటో, బొలేరో ట్రాలీ వాహనం సీజ్


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ షేక్‌లాల్ మదార్

కొడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని కంచన్‌పల్లి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్ ఆధ్వర్యంలో కొడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, పోలీసుల బృందం గ్రామంలో ఇంటింటికి తిరిగి సోదాలు చేశారు. 41 ఇళ్లను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 15బైక్‌లు, ఒక ఆటోతోపాటు, బొలేరో ట్రాలీ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ షేక్‌లాల్ మదార్ మాట్లాడుతూ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేసి ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకొస్తే తిరిగి ఇస్తామన్నారు.

వాగులో పడి...

మనూరు(నారాయణఖేడ్): ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ లక్ష్మణ్ కథనం ప్రకారం..వట్‌పల్లి మండలం పాలడుగు గ్రామానికి చెందిన దేవునూరి శంకర్(48)రామచంద్రాపురంలో నివాసం ఉంటున్నాడు. సొంతూరికి వెళుతున్నానని భార్య శోభకు చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మనూరు మండలం ఉసిరికెపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై వాగు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి నీటిలో పడి చనిపోయాడు. ఈ విషయం శనివారం వెలుగుచూసింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం...కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన గంగిశెట్టి పెంటయ్య(65) శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాజీవ్‌రహదారిపై బస్టాండ్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన


కళాశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచ గ్రామ శివారులోని రంగనాయకసాగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న రంగనాయక స్వామి బీ ఫార్మసీ కళాశాల నిర్మాణ పనులను ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా యూనివర్సిటీ ఫార్మసీ డిపార్ట్ మెంట్ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అనుమతి కోసం పంపే ప్రతిపాదనలకు అనుగుణంగా జరుగుతున్న పనులను, తరగతి గదులు, ల్యాబ్‌లు, కళాశాల నిర్మాణ విధానాలను పరిశీలించారు. ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో రూ.10 కోట్లతో కళాశాల నిర్మాణం జరుగుతోంది. 6 ఎకరాల విస్తీర్ణంలో ఐదు అంతస్తులతో భవనం నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 60 సీట్లతో బీ ఫార్మసీ తరగతులు ప్రారంభించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ముహూర్తం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి సత్యభామ సహిత శ్రీ వేణు గోపాల స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు వేద పండితులు శనివారం ముహూర్తం ఖరారు చేశారు. పట్టణంలోని జె.పి కాలనీలో ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమ పత్రికను రాయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ మే 9 నుంచి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 13న దివ్య ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహ చారి, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధు, మారబోయిన రాజు యాదవ్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, హరేరామ, హరే కృష్ణ బృందం, పట్టణ పురప్రముఖులు, పెద్దలు పాల్గొన్నారు.

డీఎస్‌ఓ విచారణ


దిడిగిలో విచారణ జరుపుతున్న డీఎస్‌ఓ

జహీరాబాద్: మండలంలోని దిడిగి గ్రామ రేషన్ డీలర్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి డీఎస్‌ఓ వనజ విచారణ జరిపారు. గ్రామ ప్రజలకు సక్రమంగా రేషన్ సరుకులు సరఫరా చేయడం లేదని, అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె విచారణ జరిపారు. ఈ సందర్భంగా పలువురి అభిప్రాయాలు సేకరించారు. ప్రజలకు ఏ మేరకు బియ్యం సరఫరా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు.

మియాపూర్ మెట్రో నుంచి పుష్పక్ బస్సులు



మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మియాపూర్: మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు పుష్పక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. శనివారం మియాపూర్ మెట్రో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ యాదగిరి, చీఫ్‌మార్కెటింగ్ అధికారి రిషి కుమార్, ఎల్‌అండ్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొని పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 24 గంటల పాటు పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఈడీ యాదగి రి తెలిపారు. ఉదయం 6:30 నుంచి రాత్రి 10:30 వరకు 20 నిమిషాల వ్యవధిలో నడుస్తాయి. అలాగే రాత్రి 11:10 నిమిషాలకు నుంచి ఉదయం 6:10 వరకు 40 నిమిషాలకు ఒక బస్సు చొప్పున అందుబాటులో ఉంటుంది.మియాపూర్ మెట్రో స్టేషన్, జేఎన్టీయూ నుంచి విమానాశ్రయం వరకు చార్జీలు రూ. 300 ఉంటుంది. అలాగే శిల్పారామం, గచ్చిబౌలి నుంచి టిక్కెట్ రూ. 250 ఉంటుంది. గూగుల్‌పే.పేటీఎం, ఫోన్‌పే వంటి సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు నగదురహిత సేవలను కూడా వినియోగించుకోవచ్చునని ఆయన చెప్పారు.ఎయిర్‌పోర్టు ప్రయాణికులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.